ఏంటీ..ఏకశిలానగర్ వివాదం?

ఉన్న భూమికి మించి వెంచర్ ఏర్పాటు
- వెంచర్ రద్దయినా ప్లాట్ల క్రయవిక్రయాలు
- దండిగా సంపాదించుకున్న దళారులు
- ఎంపీ ఈటల రంగప్రవేశంతో చర్చోపచర్చలు


వివాదాస్పద స్థలం

పోచారం: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఏకశిలానగర్ వెంచర్ వివాదం ఎంపీ ఈటల రాజేందర్ రంగప్రవేశంతో హాట్ టాపిక్‌గా మారింది. రియల్ దళారిపై ఎంపీ చేయిచేసుకోవడంతో.. అసలు ఏంటీ ఏకశిలానగర్ వ్యవహారం అంటూ అందరిలోనూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్షేత్ర స్థాయిలో సేకరించిన వివరాల ప్రకారం..ఘట్‌కేసర్ మండలం కొర్రెముల్ గ్రామంలో సర్వే నెంబర్లు 739 నుండి 749 వరకు 149 ఎకరాల భూమి చెరుకు, మునుకుంట్ల కుటుంబాల పేర్ల మీద ఉంది. వీరి నుండి 64 ఎకరాల 36 గుంటల భూమిని (సర్వే నెంబర్లు 743 నుండి 747 వరకు) 1985-89 సంవత్సరాల్లో సుందరమూర్తి, ఎన్.ప్రభాకర్‌రెడ్డి, కుంభం ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తులు కొనుగోలు చేసి ఏకశిలానగర్ పేరుతో వెంచర్ చేశారు. అనంతరం వీరు సర్వే నెంబర్లు 748, 749లోని భూమిని కూడా తమకే అమ్మాలని 2002లో జిల్లా కోర్టులో స్పెసిఫిక్ ఫెర్ఫార్మెన్స్ సూట్ వేశారు. దీనిపై 2009లో కోర్టు తుది తీర్పునిస్తూ వెంచర్ నిర్వాహకుల వినతిని కొట్టివేసింది. భూమిని వారికే అమ్మాలనడం సరికాదని పేర్కొంది. అలాగే సర్వే నెంబర్లు 739 నుండి 742 వరకు ఉన్న భూమితో ఎటువంటి సంబంధం లేదని కూడా వెంచర్ నిర్వాహకులు అంగీకరించారు. అంటే సర్వే నెంబర్లు 743 నుండి 747 వరకు 64 ఎకరాల 36 గుంటలకే ఏకశిలానగర్ పరిమితమైంది. ఈ క్రమంలో ప్లాట్లను వాయిదాల పద్ధతిలో కొనుగోలుదారులకు ఏజెంట్లు అమ్మేశారు. కొందరు వ్యక్తులు ఉన్న భూమి కంటే ఎక్కువ భూమిలో...ఇతర సర్వే నెంబర్లలోని ప్లాట్లను సైతం అక్రమంగా విక్రయించారు. ఇదిలా ఉండగా సర్వే నెంబర్లు 739 నుండి 742 వరకు వెంచర్‌కు సంబంధం లేని 58 ఎకరాల భూమిలో 47 ఎకరాల 25 గుంటలను ఎ.వెంకటేశ్ అనే బిల్డర్ 2005లో భూమి మొదటి ఓనర్ల నుంచి కొనుగోలు చేశారు. 2006లో సర్వే నెంబర్లు 739 నుండి 749 వరకు చేసిన లేఅవుట్ రద్దయింది. లేఅవుట్ రద్దును సవాల్ చేస్తూ హైకోర్టులో కేసు వేశారు. కోర్టు చేపట్టిన విచారణలోనూ లేఅవుట్ అక్రమమని 2010లో తేలింది. రద్దయిన లేఅవుట్‌లో ఎల్ఆర్ఎస్, ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేయవద్దని సంబంధిత అధికారులను కోర్టు ఆదేశించింది. అంటే వివాదాస్పదంగా ఉన్న 149 ఎకరాల భూమి మూడు భాగాలుగా ఉంది. మొదటి భాగంలో వెంకటేశ్‌కు 47 ఎకరాల 25 గుంటలు, రెండో భాగంలో ఏకశిలానగర్ వెంచర్‌కు 64 ఎకరాల 36 కుంటలు, మిగిలిన భాగంలో చైతన్యనగర్‌తో పాటు ఖాళీ జాగాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏకశిలానగర్‌కు చెందిన కొందరు ప్లాట్ల కొనుగోలుదారులు మాత్రం వెంకటేశ్ తమ భూమిని ఆక్రమించాడని ఆరోపిస్తున్నాడు. తాను నిబంధనల ప్రకారం కొనుగోలు చేశానని వెంకటేశ్ చెబుతున్నారు. ఈ క్రమంలోనే వివాదం తలెత్తింది.

"నా భూములు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు..



జుబేర్ అక్రమ్, చెరుకు శివారెడ్డి, సామిరెడ్డి అనే వ్యక్తులు 2009లో నాకు సంబంధించిన పర్మినెంట్ ఇంజెక్షన్ ఆర్డర్‌తో పాటు సేల్ డీడ్లు రద్దు చేయాలని కోర్టును ఆశ్రయించారు. కానీ అలా రద్దు చేయడం కుదరదని కోర్టు తీర్పు చెప్పింది. మళ్లీ 2023లో ఇదే వ్యక్తులు నా పాస్‌పుస్తకాలు, మ్యుటేషన్‌లపై కోర్టు స్టే తెచ్చారు. తదుపరి విచారణలో స్టే ఆర్డర్‌ను రద్దు చేస్తూ 2023లోనే సవరించిన ఆదేశాలను కోర్టు జారీ చేసింది. ఇలా నాపై అక్రమ కేసులు, సివిల్ సూట్స్ ఫైల్ చేశారు. అన్నింటిలో వ్యతిరేక తీర్పులు పొందిన తర్వాత కూడా నా భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు.

- ఎ.వెంకటేశ్, బిల్డర్

ఇంకా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి

ఏకశిలానగర్ లేఅవుట్‌ను అధికారులు పునరుద్ధరించారు. ఇంకా కొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. లేఅవుట్‌లో పేర్కొన్న స్థలంలో సర్వే చేయబోమని ఘట్‌కేసర్ తహసీల్దారు హామీ ఇచ్చారు. 149 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ ఉంటుంది.

- ఏక శిలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు"

రెండవ రోజు కొనసాగిన వార్డు సభలు


2వ వార్డు సభలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక, ఎంపికైన లబ్ధిదారుల జాబితా విడుదల కోసం నిర్వహిస్తున్న వార్డు గ్రామ సభలు మేడ్చల్ మున్సిపాలిటీలోని వివిధ వార్డులలో, మండలంలోని వివిధ గ్రామాలలో రెండవ రోజైన బుధవారం కొనసాగాయి. అధికారులు, కౌన్సిలర్లు సభలలో పాల్గొని జాబితాలను విడుదల చేశారు. పలు గ్రామాలలో గ్రామ సభలు రసాభాసలు చోటు చేసుకున్నాయి.పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామి ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లోని సంక్షేమ పథకాలన్నీ అర్హులైన అందరికీ అందుతాయని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా పట్టణంలోని 18,23,3 వార్డులలో నిర్వహించిన వార్డు సభలలో ఆమె పాల్గొని సభలను ప్రారంభించారు. ప్రభుత్వం రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక, రైతు భరోసా, రైతు భీమాకు ఎంపికైన లబ్ధిదారుల జాబిత విడుదల చేశారు. రేషన్ కార్డులు అర్హులైన అందరికీ వస్తాయని, రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కౌన్సిల్ చూస్తుందన్నారు. సభలలో కౌన్సిలర్లు మహేష్, భవాని రాఘవేందర్‌గౌడ్, కమిషనర్ నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గౌడవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు పలు గ్రామాలలో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ రాంబాబు తెలిపారు. గౌడవెల్లి, బాసిరేగడి, అయోధ్య చౌరస్తా తదితర ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

23వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభం


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్, కౌన్సిలర్ తదితరులు

మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డులో వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్ మహేష్‌తో కలిసి ప్రారంభించారు. వార్డులో చేపట్టిన పనులను, వ్యాక్సినేషన్ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన పనులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ప్రాధాన్యం : అదనపు కలెక్టర్


కొల్తూర్ గ్రామసభలో.. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మండలం, కొల్తూర్ గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులై, దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన పడవద్దు అని వివరించారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు కూడా మళ్లీ చేసుకునే అవకాశం ప్రభుత్వ కల్పించిందన్నారు. కార్యక్రమంలో మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతక్కకు ఆహ్వానం



కీసర: సెరినిటీ స్కూల్ వార్షికోత్సవానికి మంత్రి సీతక్కను స్కూల్ ప్రిన్సిపాల్ జగ్గారెడ్డి ఆహ్వానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను ఆశీర్వదించాలని సీతక్కను కోరారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ కీసర మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాసరెడ్డి, స్కూల్ ప్రతినిధులు సుబ్బారావు, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

మైనర్లతో పని చేయిస్తున్న వారిపై కేసు

ఘట్‌కేసర్: మైనర్లతో పని చేయిస్తున్న వారిపై ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని అవుషాపూర్ మహాలక్ష్మీ కిరణా షాపులో మైనర్ బాలుడు రాజస్థాన్‌కు చెందిన రుద్రాంత్ (14), ఎన్ఎఫ్‌సీనగర్‌లో మైనర్ బాలుడు గొల్ల శివ (15)తో మార్బుల్ పని చేస్తున్నట్లు గుర్తించారు. బుధవారం తనిఖీలు చేపట్టి బాల కార్మికులను రక్షించారు. కిరాణా షాపు యజమాని రాంకు మావత్, కుమ్మరి శంకర్‌పై బాల కార్మికుల చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు.

హాస్టల్ యజమానిపై కేసు నమోదు

పోచారం: ప్రైవేట్ హాస్టల్‌లో పనిచేస్తున్న బాల కార్మికుని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు బుధవారం గుర్తించారు. సీఐ రాజు తెలిపిన ప్రకారం.. జోడిమెట్లలోని శ్రీ సాయి హాస్టల్‌లో బాల కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన 16 ఏళ్ల బాలుడు దినసరి రూ. 300 కూలీకి గత మూడు నెలలుగా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈనేపథ్యంలో బాలుడి పని మాన్పించి, హాస్టల్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా మైదానాన్ని కబ్జా చేస్తే కఠిన చర్యలు


ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న మాజీ మేయర్ కావ్య, యువ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో క్రీడా మైదానానికి కేటాయించిన సర్వే నెంబర్-704,706 స్థలం కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మేయర్ కావ్య, ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలోనే యువతకు క్రీడా మైదానాన్ని కేటాయించామని, కబ్జా చేస్తే ఏలాంటి వారిపైన అయిున కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు నరేందర్‌యాదవ్, కార్తీక్‌రెడ్డి, విక్రమ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు


ఘనాపూర్ గ్రామసభలో.. మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని ఘనాపూర్‌లో గ్రామ సభ, 7,8,10,11 వార్డులో బుధవారం నిర్వహించిన వార్డు సభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఈ నెల 26న ప్రారంభం కానున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 24 వరకు గడువు ఉందన్నారు. కొత్త రేషన్ కార్డులు, కార్డులో కొత్త పేరు నమోదు కోసం గతంలో దరఖాస్తు చేయనివారు ఈ సభల్లో దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. ఎంపీడీఓ గీత రెడ్డి, తహసీల్దార్ రజిని, కౌన్సిలర్లు నాగజ్యోతి, నర్సింగ్‌రావు, హేమలత, శశికళ, మల్లేష్, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్, నాయకుల ఖయూమ్, శివప్రదీప్‌రెడ్డి, రాజు, సురేష్ పాల్గొన్నారు.

ఎంపీ ఈటల దాడి అమానుషం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలానగర్ వెంచర్‌ను పరిశీలించడానికి వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్ ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై చేయి చేసుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెట్టు నర్సింహారెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోలీసులు, అధికారులు చేయాల్సిన పనిని ఎంపీ చేయడమేమిటని ప్రశ్నించారు. స్థాయిని మరిచిపోయి ప్రవర్తించారని విమర్శించారు. ప్రైవేట్ వ్యక్తుల ఆస్తుల వివాదాన్ని పరిష్కరించేందుకు కోర్టులు, పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం ఉన్నాయన్న విషయం మర్చిపోయి వ్యవహరించినట్లు ఉందన్నారు. స్థానిక నాయకులు ఈటలను తప్పుదోవ పట్టించారన్నారు. ఎంపీకి సరైన సమాచారం ఇవ్వకుండా ఇరుకున పడేశారన్నారు. వ్యక్తులపై చేయి చేసుకోవడం రాజకీయ నాయకులకు తగదన్నారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు ఆవేశంతో కాకుండా ఆలోచనతో వ్యవహరించాలని హితవు పలికారు.

కొనసాగిన వార్డు, గ్రామ సభలు


కండ్లకోయ వార్డు సభలో అధికారులు, నాయకులు


రాజబొల్లారం గ్రామ సభలో అధికారులు, గ్రామస్తులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వార్డు, గ్రామ సభలు కొనసాగాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో ఏర్పాటు చేసిన వార్డు సభలో కౌన్సిలర్ హంసరాణి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, అధికారులు, మాజీ సర్పంచులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్‌లు పాల్గొని ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబిత వివరించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని రాజబొల్లారం, సోమారం, ఎల్లంపేట్, రాజబొల్లారం తండా గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. గ్రామస్తులు సభలో పాల్గొని కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాల జాబితాలో తమ పేర్లు లేవని అధికారులతో మొరపెట్టుకుని తిరిగి దరఖాస్తులు సమర్పించారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



మేడ్చల్: ఎమ్మెల్సీ కవితను మేడ్చల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు కలిశారు. నగరంలోని కవిత నివాసానికి నాయకులు వెళ్లి ఆమెను కలిసి మాట్లాడారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటాలకు మేడ్చల్ నాయకులు అండగా ఉంటారని అన్నారు. కవితను కలిసిన వారిలో భాస్కర్‌యాదవ్, శంకర్ తదితరులు ఉన్నారు.

దవాఖానాల్లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ ఆసుపత్రులు, బస్తీ, పల్లె దవాఖానాలు, పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించటం లేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం మేడ్చల్ జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యారోగ్యశాఖ (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రఘునాథ్‌స్వామి ఆకస్మిక తనిఖీలు చేశారు. పీర్జాదిగూడ నగరపాల సంస్థ పరిధిలోని చెంగిచర్ల, భగత్‌సింగ్‌నగర్‌లోని బస్తీ దవాఖానాతోసహా మేడిపల్లిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, నారపల్లిలో ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌ఓ డాక్టరు రఘునాథ్‌స్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణీలకు పరీక్షలు, ప్రసవాలు, ల్యాబ్ సేవలు, రోగ నిర్ధారణ, ఫార్మసీ స్టాక్‌లపై ఆయన ఆరా తీశారు.అలాగే, టీకాలు మందుల నిల్వలపై సంబంధిత వైద్యులు, ఉద్యోగులతో ఆయన సమీక్షించారు. ఆపరేషన్ థియేటర్లు, లేబర్ రూముల పని తీరును పరిశీలించటంతో పాటు తక్షణ అవసరాలను గుర్తించారు. దవాఖానాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వాహణ తదితర విషయాలను అడిగితెలుసుకున్నారు.

సమయపాలనపై ఆరా...

జిల్లాలో పలు ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి వైద్య అధికారులు, సిబ్బంది సమయపాలనకు సంబంధించిన హాజరు పట్టికను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కచ్చితంగా పాటించాలని ఆదేశించటంతోపాటు నిర్లక్ష్యం వహించిన వారిపై చట్టపరమైన క్రమ శిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మందుల నిల్వలను పర్యవేక్షించి, జిల్లా డ్రగ్స్ స్టోర్ నుంచి అవసరమైన మందులను సేకరించాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరఫున ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా అందించే అన్నీ ప్రయోజనాలు ప్రజలకు అందేలా చూడాలని సూచించారు. ఈ ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఎక్కడైనా నిర్లక్ష్యం కనబడితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలి

కీసర: వార్డు సభలను సద్వినియోగం చేసుకొని అర్హులందరూ సంక్షేమ ఫలాలను పొందాలని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం 7 నుంచి 12 వార్డుల్లో నిర్వహించిన వార్డు సభలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పలు అభివృద్ధి పనులు ప్రారంభం


నారపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో పూర్తి చేసిన అభివృద్ధి పనులను చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.3.20 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. 13వ వార్డులో సీసీ రోడ్డు, 15వ వార్డులోని నారపల్లిలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎస్‌సీ వైకుంఠధామం, డ్వాక్రా భవనం వినియోగంలోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు శ్రీలతా బుచ్చిరెడ్డి, సరితా స్వామి, మమతా జగన్మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు


ఒప్పందం చేసుకుంటున్న కేపీఆర్ఐటీ, ఓయూ ప్రతినిధులు

ఘట్‌కేసర్: విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నూతన ఆవిష్కరణలు ఉండాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం అన్నారు. మున్సిపాలిటీలోని ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల (కేపీఆర్ఐటీ) ప్రతినిధులు, ఓయూ ప్రొఫెసర్ల బృందంతో ఆ కళాశాలలో విద్యారంగ అభివృద్ధి, ఇంజనీరింగ్ విద్యకు సంబంధించిన నూతన ఆవిష్కరణలు, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా పలు అంశాలపై బుధవారం చర్చించారు. ఆయా రంగాల్లో సంయుక్త నిర్ణయాలు తీసుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో కేపీఆర్ఐటీ వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్, డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణ లక్ష్యం ఖరారు

- బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ.196 కోట్లు
- గతేడాది లింకేజీ కింద సాధించిన రుణ లక్ష్యం ప్రగతి 118 శాతం
- స్త్రీ నిధి రుణ లక్ష్యం రూ.18కోట్లు
- ఈ ఏడాదిలో సంఘాలకు రుణ లక్ష్యంపై డీఆర్‌డీఏ ప్రణాళిక



సాక్షి,సిటీబ్యూరో: మహిళా సంఘాలకు ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని నిర్ధేశించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల్లో 3,390 సంఘాలకు రూ.196 కోట్ల లింకేజీ రుణాన్ని మంజూరిచ్చేలా ప్రణాళికను రూపొందించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 3,383 మహిళా సంఘాలకు రూ.164.20 కోట్లకు గానూ నిర్దేశిత లక్ష్యాన్నిదాటి రూ.194.56 కోట్ల(118.48శాతం) రుణాలను పంపిణీ చేయటంతోపాటు రికవరీలోనూ ప్రగతిని సాధించారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ నిర్దేశిత రుణ లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా రుణాలను తీసుకున్న వారందరూ తమ ఆదాయాన్ని అభివృద్ధి చేసుకునేలా నూనెలు, కిరాణాలు, పప్పుల మిల్లులు, ఇతరత్రా ఉత్పత్తుల తయారీలో భాగంగా భిన్నమైన యూనిట్లను నెలకొల్పుకున్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. మరోవైపు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిరిగి సంఘాల ఖాతాలో జమచేయాల్సి ఉండగా.. దాదాపుగా మూడేళ్లవడ్డీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ చెల్లిస్తామని, వడ్డీలేని రుణ పథకాన్ని చేపడతామన్న కొత్త ప్రభుత్వం ప్రకటన అమలుతో మహిళా సంఘాలు మరింతగా బలోపేతం కావటంతోపాటు ప్రోత్సాహకరంగా ఉండనున్నట్లు డీఆర్‌డీఏ పేర్కొంటోంది. అలాగే, స్త్రీనిధి కింద మహిళా సంఘాలకు రుణ లక్ష్యం రూ. 18 కోట్లు అందజేసేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. గతేడాది స్త్రీనిధి కింద స్వయం సహాయక సంఘాలకు రుణ లక్ష్యం రూ.15.01 కోట్లు కాగా, రూ.15.48 కోట్లు (102.17 శాతం) పంపిణీ చేశారు. లక్ష్యానికి మించి ప్రగతి సాధించటంతో ఈ ఏడాది రుణ లక్ష్యాన్ని రూ. 19 కోట్లకు పెంచినట్లు డీఆర్డీఏ వర్గాలు పేర్కొంటున్నాయి.

వృద్ధురాలి అదృశ్యం


భాగ్య (ఫైల్)

జవహర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్‌లో నివసించే కందగట్ల భాగ్య (63) కుటుంబ సభ్యులతో ఉంటోంది. ఈ నెల 6న ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఫలితం లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే గతంలో భాగ్య అప్పులు చేసి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.